TGTEL/26/A4985

# ఆదాబ్ సైబరాబాద్

ADAAB CYBERABAD

www.adaabcyberabad.com
epaper.adaabcyberabad.com
adaabcyberabad@gmail.com

| ఎడిటర్ : బిల్లాల్‌పూర్‌సారా శివ కుమార్ | సంపుటి : 1 | సంచిక : 10 | శుక్రవారం, జూలై 24, 2026 | పేజీలు - 4 | వెల: 5/- |
|---|---|---|---|---|---|
| EDITOR : BILLALPURSARA SHIVA KUMAR | VOLUME : 1 | ISSUE: 10 | 24-07-2026 (FRIDAY) | PAGES: 4 | RS : 5/- |

# రోమేనియా అధ్యక్షుడితో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము భేటీ..

## ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంపై చర్చలు



ఆదాబ్ సైబరాబాద్, న్యూ ఢిల్లీ : భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తన విదేశీ పర్యటనలో భాగంగా రోమేనియా రాజధాని బుకారెస్ట్‌కు చేరుకుని, రోమేనియా అధ్యక్షుడు నికుషోర్ డాన్‌తో ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు. దాదాపు మూడు దశాబ్దాల తర్వాత భారత రాష్ట్రపతి రోమేనియాను సందర్శించడం విశేషం.

కోట్రోసేని ప్యాలెస్‌లో జరిగిన అధికారిక స్వాగత కార్యక్రమం అనంతరం ఇరు దేశాల ప్రతినిధి బృందాల మధ్య చర్చలు జరిగాయి. వాణిజ్యం, పెట్టుబడులు, సరఫరా గొలుసుల బలోపేతం, విద్య, విజ్ఞానశాస్త్రం, సాంకేతికత, సాంస్కృతిక సహకారం తదితర అంశాలపై ఇరు దేశాలు విస్తృతంగా చర్చించాయి.

భారత్--యూరోపియన్ యూనియన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఖీూా) ఇరు దేశాల పరిశ్రమలు, నైపుణ్యం కలిగిన వృత్తి నిపుణులకు అపూర్వ అవకాశాలను కల్పిస్తుందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. వచ్చే మూడు సంవత్సరాల్లో ద్వైపాక్షిక వాణిజ్యాన్ని రెట్టింపు చేయాలని ఇరు దేశాలు లక్ష్యంగా పెట్టుకున్నాయి.

ఈ సందర్భంగా విద్య, సంస్కృతి, ప్రజల మధ్య సంబంధాల బలోపేతానికి సంబంధించిన మూడు కీలక ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. బుకారెస్ట్ విశ్వవిద్యాలయంలో భారత అధ్యయనాల చైర్ ఏర్పాటు చేయడంతో పాటు, ఐటెక్ (×ుజుజ) కార్యక్రమం కింద రోమేనియాకు అందించే శిక్షణ అవకాశాలను రెట్టింపు చేయాలని భారత్ నిర్ణయించింది.

2028లో భారత్-రోమేనియా దౌత్య సంబంధాల 80వ వార్షికోత్సవాన్ని లిలి"ఇండియా-రోమేనియా ఇయర్ ఆఫ్ ఇన్నోవేషన్"లిలిగా నిర్వహించేందుకు ఇరు దేశాలు అంగీకరించాయి.

శుక్రవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఇండియా--రోమేనియా బిజినెస్ ఫోరంను ఉద్దేశించి ప్రసంగించనుండగా, రోమేనియా పార్లమెంట్‌తో పాటు బుకారెస్ట్ యూనివర్సిటీ ఆఫ్ ఎకనామిక్ స్టడీస్‌ను సందర్శించనున్నారు.

## క్యూర్ పరిధికి 50 ఏళ్ల తాగునీటి మాస్టర్ ప్లాన్ రూపొందించండి: సీఎం రేవంత్ రెడ్డి



ఆదాబ్ సైబరాబాద్, హైదరాబాద్:క్యూర్ (కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ) పరిధిలో తాగునీటి సరఫరాకు సమగ్ర మాస్టర్ ప్లాన్ రూపొందించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీ, మల్కాజిగిరి, సైబరాబాద్ కార్పొరేషన్లతో పాటు విలీన మున్సిపాలిటీల్లోనూ తాగునీటి సరఫరాలో ఏకరూపత ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు పనులపై నిర్వహించిన సమీక్షలో సీఎం మాట్లాడుతూ, రానున్న 50 ఏళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలని పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో తాగునీటి నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, హైదరాబాద్ చుట్టుపక్కల నీటి వనరులను పరస్పరం అనుసంధానం చేసి ఒక వనరులో అంతరాయం వచ్చినా మరో వనరుతో సరఫరా కొనసాగేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

మూడు, నాలుగు రోజులకు ఒకసారి మాత్రమే నీరు అందుతున్న ప్రాంతాల్లో ఇకపై రోజు విడిచి రోజు తాగునీరు సరఫరా చేసేలా ప్రణాళికలు అమలు చేయాలని సూచించారు. ప్రస్తుతం కొనసాగుతున్న తాగునీటి, ఎస్టీపీ (సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్) నిర్మాణ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, పనుల పురోగతిపై ప్రతి నెలా నివేదిక సమర్పించడంతో పాటు పర్యవేక్షణ కోసం ప్రత్యేక డ్యాష్‌బోర్డు ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించారు. పరిశ్రమలు, నిర్మాణ రంగంలో గ్రే వాటర్ వినియోగాన్ని ప్రోత్సహించేలా నిబంధనలు రూపొందించాలని కూడా ముఖ్యమంత్రి సూచించారు. సమావేశంలో మున్సిపల్ వ్యవహారాల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సీఎం కార్యదర్శి మాణిక్ రాజ్, జలమండలి ఎండీ కె. అశోక్ రెడ్డి, జేఎండీ మయాంక్ మిట్టల్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## ఆగస్టు 18న దేశవ్యాప్తంగా మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞ..

### 1012 కోట్ల మందిని భాగస్వామ్యం చేయనున్న కేంద్రం




ఆదాబ్ సైబరాబాద్, న్యూ ఢిల్లీ : నషా ముక్త్ భారత్ అభియాన్ (ఎన్‌ఎంబీఏ) ప్రారంభించి ఆరు సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా ఈ ఏడాది ఆగస్టు 18న దేశవ్యాప్తంగా మాదకద్రవ్యాల వ్యతిరేక జాతీయ ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ఈ కార్యక్రమంలో భౌతికంగా, ఆన్‌లైన్ ద్వారా 10 నుంచి 12 కోట్ల మందికి పైగా పౌరులను భాగస్వామ్యం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ మేరకు న్యూఢిల్లీలో డ్రగ్ ప్రివెన్షన్ విభాగం జాయింట్ సెక్రటరీ డాక్టర్ సందీప్ రేవాజీ రాథోడ్ అధ్యక్షతన ఉన్నతస్థాయి సమన్వయ సమావేశం జరిగింది. వివిధ కేంద్ర మంత్రిత్వ శాఖలు, ప్రభుత్వ శాఖలు, విద్యాసంస్థలు, ప్రభుత్వ రంగ సంస్థలు, రైల్వే, రక్షణ, పోలీసు, సీఏపీఎఫ్, ఎన్‌సీసీ, ఆయుష్, గ్రామీణాభివృద్ధి, రెవెన్యూ శాఖలు, స్వచ్ఛంద, సామాజిక, ఆధ్యాత్మిక సంస్థలు, సామాజిక మాధ్యమ ప్రభావశీలుల భాగస్వామ్యంతో ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించారు. మాదకద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండే బాధ్యతను ప్రజల్లో పెంపొందించడం, వ్యసన బాధితులకు తోడ్పాటు అందించడం, యువతను మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములను చేయడమే ఈ ప్రతిజ్ఞ ప్రధాన ఉద్దేశమని కేంద్రం పేర్కొంది. అలాగే వ్యసన విముక్తి కోసం 14446 హెల్ప్‌లైన్, నషా ముక్తి మిత్రగా నమోదు, సమీప డీ-అడిక్షన్ కేంద్రాల సమాచారానికి ఎన్‌ఎంబీఏ 2.0 మొబైల్ యాప్ వినియోగాన్ని ప్రోత్సహించనుంది. కంద్ర ప్రభుత్వం 2020 ఆగస్టు 15న ప్రారంభించిన నషా ముక్త్ భారత్ అభియాన్ ద్వారా ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 29.68 కోట్ల మందికి పైగా అవగాహన కల్పించినట్లు వెల్లడించింది. ఇందులో 11.43 కోట్ల మంది యువత, 8.05 కోట్ల మంది మహిళలు ఉన్నారు. అలాగే 1.25 లక్షలకుపైగా నషా ముక్తి మిత్రలు ఈ ఉద్యమంలో భాగస్వాములై మాదకద్రవ్యాల నిర్మూలనకు కృషి చేస్తున్నట్లు తెలిపింది.

### డీఆర్‌డీవో 'కుషా' దీర్ఘశ్రేణి క్షిపణి విజయవంతం

ఆదాబ్ సైబరాబాద్ న్యూఢిల్లీ: భారత రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) స్వదేశీంగా అభివృద్ధి చేసిన 'కుషా' (ఖబంస్త్రు) లాంగ్ రేంజ్ సర్ఫేస్-టు-ఎయిర్ మిసైల్ తొలి ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించింది. ఒడిశా తీరంలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ద్వీపం నుంచి బుధవారం ఈ ప్రయోగం చేపట్టినట్లు డీఆర్‌డీవో వెల్లడించింది. అధిక వేగంతో, అత్యంత ఎత్తులో ప్రయాణించే వైమానిక లక్ష్యాన్ని అనుకరించిన ఎలక్ట్రానిక్ టార్గెట్‌ను 'కుషా' క్షిపణి విజయవంతంగా ఛేదించింది. ఈ క్షిపణి యుద్ధ విమానాలు, క్షిపణులు, డ్రోన్లు, భారీ శత్రు విమానాలు వంటి పలు రకాల వైమానిక ముప్పులను విస్తృత దూరం, ఎత్తులోనే సమర్థంగా నిర్వీర్యం చేయగల సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఈ వ్యవస్థలోని క్షిపణులు, రాడార్లు, కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ సహా అన్ని కీలక భాగాలను డీఆర్‌డీవో ప్రయోగశాలలు, భారతీయ పరిశ్రమల భాగస్వామ్యంతో స్వదేశీ సాంకేతికతతో అభివృద్ధి చేశారు. ఈ విజయవంతమైన ప్రయోగంపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హర్షం వ్యక్తం చేస్తూ, దీర్ఘశ్రేణి వైమానిక రక్షణ వ్యవస్థ అభివృద్ధిలో భారత్ కీలక మైలురాయిని చేరుకుందని పేర్కొన్నారు.



## యాదగిరిగుట్టలో వెదురు బుట్ట అల్లిన మంత్రి కొండా సురేఖ..

### శ్రమకు, చేతివృత్తులకు వందనం

ఆదాబ్ సైబరాబాద్, హైదరాబాద్: తెలంగాణ అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ యాదగిరిగుట్టలో స్థానిక కళాకారులతో కలిసి సంప్రదాయ వెదురు బుట్ట అల్లే కళను స్వయంగా అనుభవించారు. కళాకారుల మార్గదర్శకత్వంలో బుట్ట అల్లుతూ వారి నైపుణ్యం, కృషి, అంకితభావాన్ని దగ్గరగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఆదిమ సమాజం నుంచి ఆధునిక నాగరికత వరకు మానవ అభివృద్ధికి శ్రమే ప్రధాన చోదకశక్తిగా నిలిచిందన్నారు. చేతి శ్రమ, మేధస్సు సమన్వయంతోనే ఆవిష్కరణలు, అభివృద్ధి సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. వెదురు బుట్టల తయారీ ద్వారా శతాబ్దాలుగా కొనసాగుతున్న తెలంగాణ సంప్రదాయ చేతివృత్తులను కళాకారులు తమ నైపుణ్యంతో సజీవంగా ఉంచుతున్నారని కొనియాడారు. శ్రమకు గౌరవం ఇచ్చే సమాజమే తన సంస్కృతిని పరిరక్షించుకుని, భవిష్యత్తును సుస్థిరం చేసుకుంటుందని మంత్రి అన్నారు.
యాదగిరిగుట్ట నేడు వరుణ యాగానికి మాత్రమే కాకుండా లిలి"శ్రమ యాగానికి"లిలి కూడా ప్రతీకగా నిలుస్తోందని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు.



## ఇందిరమ్మ టవర్స్‌తో పేదలకు సొంతింటి కల..

### లబ్ధిదారుడి వాటా రూ.6 లక్షలే: మంత్రి పొంగులేటి



ఆదాబ్ సైబరాబాద్, హైదరాబాద్: నగరంలో సొంత ఇల్లు లేని పేద, దిగువ మధ్యతరగతి కుటుంబాలకు అందుబాటు ధరలో గృహాలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ టవర్స్ నిర్మాణ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. సచివాలయంలో నిర్వహించిన సమీక్ష అనంతరం ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకుని లబ్ధిదారులు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు సమీపంలోనే గృహాలు నిర్మిస్తామని చెప్పారు. కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను ప్రజల సంక్షేమానికి వినియోగిస్తూ శాశ్వత గృహ భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రభుత్వం ఒక్కో ఇంటికి రూ.5 లక్షల సబ్సిడీ అందిస్తోందని, లబ్ధిదారుడి వాటా అన్ని ప్రాంతాల్లో రూ.6 లక్షలు మాత్రమే ఉంటుందని వెల్లడించారు. తొలి విడతలో నిర్మించే ఫ్లాట్ల మార్కెట్ విలువ రూ.40 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు ఉండగా, భూమి విలువ, నిర్మాణ వ్యయం, ప్రభుత్వ సబ్సిడీతో అర్హులకు తక్కువ ధరలో గృహాలు అందనున్నాయని వివరించారు. క్యూర్ పరిధిలో నిర్మించే ఇందిరమ్మ గృహాల్లో ఎస్సీలకు 14%, ఎస్టీలకు 5%, బీసీలకు 16%, దివ్యాంగులకు 5%, ప్రభుత్వ అవుట్‌సోర్సింగ్, నాలుగో తరగతి ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులకు 10% చొప్పున మొత్తం 50 శాతం రిజర్వేషన్కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ రిజర్వేషన్‌లో 30 శాతం మహిళలకు కేటాయిస్తామని చెప్పారు. మిగిలిన 50 శాతం గృహాలు జనరల్ కేటగిరీకి కేటాయించనున్నట్లు వెల్లడించారు. అర్హులైన వారు సమీప మీసేవ కేంద్రాలు, మీసేవ వాట్సాప్ నంబర్ 8096958096, అలాగే మీసేవ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు.

## కార్పొరేట్ స్థాయిలో గురుకులాల అభివృద్ధి..

### విద్యార్థుల సంక్షేమంలో రాజీ లేదు



ఆదాబ్ సైబరాబాద్, హైదరాబాద్: రాష్ట్రంలోని గురుకుల విద్యాసంస్థలను కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. విద్యార్థుల సంక్షేమం, నాణ్యమైన విద్య, పోషకాహారం, ఆధునిక మౌలిక సదుపాయాల కల్పనలో ఎలాంటి రాజీ ఉండదని అన్నారు. సరూర్‌నగర్‌లోని విక్టోరియా మెమోరియల్ రెసిడెన్షియల్ విద్యాసంస్థను గురువారం సందర్శించిన మంత్రి విద్యా ప్రమాణాలు, హాస్టల్ వసతులు, పారిశుధ్యం, భోజన సదుపాయాలు, విద్యార్థుల సంక్షేమంపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. కొత్తగా చేరిన విద్యార్థులకు ప్లేట్, గ్లాస్, బౌల్, కప్పు, స్పూన్, బెడ్‌షీట్, టవల్, దుప్పటి, బ్లాక్-వైట్ షూస్, సాక్స్, స్కూల్ బ్యాగ్‌తో కూడిన 11 వస్తువుల వెల్కమ్ కిట్ అందజేశారు. జాతీయ స్థాయి క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేద విద్యార్థులకు దేశంలోని అత్యుత్తమ విద్యాసంస్థలకు సమానమైన అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. "ప్రతిభకు పేదరికం అడ్డంకి కాకూడదు" అనే సంకల్పంతో గురుకులాలను అత్యున్నత స్థాయికి తీసుకెళ్తున్నామని తెలిపారు.

## సింగరేణి తెలంగాణ గుండె చప్పుడు..

### ప్రైవేట్ పోటీని తట్టుకునేలా ఉత్పత్తి వ్యయం తగ్గించాలి: డిప్యూటీ సీఎం



ఆదాబ్ సైబరాబాద్, ఖమ్మం/సత్తుపల్లి: సింగరేణి సంస్థను మరింత బలోపేతం చేసి, భావితరాలకు లాభదాయకమైన ప్రభుత్వ రంగ సంస్థగా అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. తెలంగాణ ప్రజలకు, సింగరేణికి విడదీయరాని భావోద్వేగ అనుబంధం ఉందని పేర్కొన్నారు. సత్తుపల్లి ఓపెన్‌కాస్ట్ గనిని పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, సింగరేణి కార్యకలాపాలు, బొగ్గు నిల్వలు, ఉత్పత్తి ప్రక్రియ, బొగ్గు నాణ్యతపై సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. ప్రస్తుతం బొగ్గు రంగంలో ప్రైవేటు సంస్థలు, దిగుమతి బొగ్గుతో తీవ్ర పోటీ నెలకొన్న నేపథ్యంలో సింగరేణి నాణ్యమైన బొగ్గును ఉత్పత్తి చేయడంతో పాటు ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించాలని సూచించారు. బ్లాస్టింగ్, లోడింగ్ సమయంలో మట్టి, రాళ్లు బొగ్గులో కలవకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. నాసిరకం బొగ్గు రవాణా వల్ల రవాణా ఖర్చులు పెరగడమే కాకుండా థర్మల్ విద్యుత్ కేంద్రాల సామర్థ్యం తగ్గి, ప్లాంట్లు నిలిచిపోయే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు. టీజెన్‌కోతో పాటు ఇతర వినియోగదారులకు నాణ్యమైన బొగ్గు మాత్రమే సరఫరా చేయాలని స్పష్టం చేశారు. గత పదేళ్లలో కొత్త బొగ్గు బ్లాకుల వేలంలో పాల్గొనకపోవడం వల్ల సింగరేణి పలు అవకాశాలను కోల్పోయిందని ఆయన పేర్కొన్నారు. ఒక బొగ్గు బ్లాక్‌ను పొందిన తర్వాత గనుల తవ్వకాలు ప్రారంభించడానికి భూసేకరణ, అటవీ అనుమతులతో కలిపి 7--8 సంవత్సరాలు పడుతుందని, అందుకే కనీసం 10 ఏళ్ల దీర్ఘకాలిక వ్యూహంతో ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. రాష్ట్ర భవిష్యత్ విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని టీజెన్‌కో, సింగరేణి సంస్థలు సంయుక్తంగా వచ్చే పదేళ్లకు అవసరమైన బొగ్గు అవసరాలపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. తాడిచర్ల-2, నాయిని బొగ్గు బ్లాకులకు సంబంధించిన భూసేకరణ, అటవీ అనుమతుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించిందని, భవిష్యత్‌లో దేశవ్యాప్తంగా జరిగే బొగ్గు బ్లాక్ వేలాల్లో సింగరేణి పాల్గొనేందుకు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.

## ఎల్‌నినో ప్రభావంపై రాష్ట్ర నిపుణుల కమిటీ తొలి సమావేశం.. శాస్త్రీయ కార్యాచరణకు శ్రీకారం




హైదరాబాద్: ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన 27 మంది సభ్యుల నిపుణుల కమిటీ తొలి సమావేశం ప్రజాభవన్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక మండలి ఉపాధ్యక్షుడు డా. జి. చిన్నారెడ్డి అధ్యక్షతన జరిగింది. వ్యవసాయం, నీటి వనరులు, విద్యుత్, అటవీ, వాతావరణం తదితర రంగాలకు చెందిన నిపుణులు సమావేశంలో పాల్గొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో సాధారణం కంటే సుమారు 30 శాతం వర్షాభావం నమోదైందని, 23 జిల్లాల్లో వర్షపాతం లోటు ఉందని డా. చిన్నారెడ్డి తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో రానున్న నెలల్లో వర్షాభావ పరిస్థితులు కొనసాగవచ్చని, అందుకే శాస్త్రీయ అంచనాల ఆధారంగా రాష్ట్ర స్థాయి అత్యవసర కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. సమావేశంలో ప్రత్యామ్నాయ పంటల సాగు, చిరుధాన్యాల ప్రోత్సాహం, నీటి సంరక్షణ, వర్షపు నీటి నిల్వ, భూగర్భ జలాల పెంపు, రిజర్వాయర్ల నిర్వహణ, విద్యుత్ వినియోగ నియంత్రణ, అటవీ సంరక్షణ, గ్రామీణ స్థాయిలో నీటి వనరుల అభివృద్ధి వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు.భారత వాతావరణ శాఖ శాస్త్రవేత్త డా. స్టెల్లా మాట్లాడుతూ, రానున్న నెలల్లో ఎల్‌నినో ప్రభావం మరింత బలపడే అవకాశం ఉందని, తెలంగాణలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవడంతో పాటు వచ్చే వేసవిలో తీవ్ర ఉష్ణోగ్రతలు, నీటి కొరత ఏర్పడే అవకాశముందని హెచ్చరించారు.రైతులకు జిల్లా వారీగా శాస్త్రీయ సూచనలు, ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని, వాతావరణ పరిస్థితులను నిరంతరం సమీక్షిస్తూ ముందస్తు చర్యలు చేపట్టాలని కమిటీ నిర్ణయించింది.



## సీఎం రేవంత్‌కు కేటీఆర్ లీగల్ నోటీసులు.. 48 గంటల్లో బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్



హైదరాబాద్: గ్లోబరీనా టెక్నాలజీస్ అంశంపై తనపై చేసిన ఆరోపణల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లీగల్ నోటీసులు జారీ చేశారు. 48 గంటల్లో బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని నోటీసులో డిమాండ్ చేశారు.ఎలాంటి ఆధారాలు లేకుండానే ముఖ్యమంత్రి మీడియా ద్వారా తనపై తప్పుడు ప్రచారం చేశారని కేటీఆర్ ఆరోపించారు. గ్లోబరీనా టెక్నాలజీస్ సంస్థతో తనకు ఎలాంటి ఆర్థిక సంబంధాలు గానీ, యాజమాన్య హక్కులు గానీ లేవని స్పష్టం చేశారు. ఆ సంస్థను తన బినామీ కంపెనీగా పేర్కొనడం, సీబీఎస్ఈ కాంట్రాక్టులు ఇప్పించానని ఆరోపించడం పూర్తిగా అవాస్తవమని పేర్కొన్నారు.అత్యున్నత రాజ్యాంగ పదవిలో ఉన్న ముఖ్యమంత్రి బాధ్యతారహితంగా నిరాధార ఆరోపణలు చేయడం తగదని కేటీఆర్ విమర్శించారు. రాజకీయ లబ్ధి కోసమే తన ప్రతిష్టను దెబ్బతీసే ఉద్దేశంతో దురుద్దేశపూర్వక వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు.నిర్దేశించిన గడువులోగా బహిరంగ క్షమాపణ చెప్పకపోతే సివిల్, క్రిమినల్ చర్యలతో పాటు పరువు నష్టం దావా కూడా వేస్తామని కేటీఆర్ లీగల్ నోటీసుల్లో హెచ్చరించారు.

## హ్యూమన్-సెంటర్డ్ ఏఐపై సాంకేతిక నివేదిక విడుదల.. బాధ్యతాయుత కృత్రిమ మేధపై దేబ్‌జానీ ఘోష్ పిలుపు

న్యూఢిల్లీ: సెంటర్ ఫర్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్‌కు చెందిన సీఎస్ఐఆర్-నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ కమ్యూనికేషన్ అండ్ పాలసీ రీసెర్చ్ ఆధ్వర్యంలో "టెక్నాలజీ రంగాన్ని మలుస్తున్న కీలక ధోరణులు" అంశంపై విశిష్ట ఉపన్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నీతి ఆయోగ్ విశిష్ట ఫెలో దేబ్‌జానీ ఘోష్ ముఖ్య వక్తగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా "హ్యూమన్-సెంటర్డ్ ఏఐ అండ్ సస్టెయినబుల్ డెవలప్‌మెంట్: ఎనర్జీ సెక్యూరిటీ కోసం సమగ్ర మార్గాలు" అనే సాంకేతిక నివేదికను ఆమె విడుదల చేశారు. ఈ నివేదికలో మానవ విలువలు, సమగ్రత, స్థిరమైన అభివృద్ధి, బాధ్యతాయుత పాలనకు ప్రాధాన్యం ఇస్తూ కృత్రిమ మేధ (ఏఐ) వినియోగంపై



సూచనలు చేశారు.

స్మార్ట్ గ్రిడ్‌లు, పునరుత్పాదక ఇంధన సమీకరణ, విద్యుత్ వ్యవస్థల నిర్వహణ, శక్తి భద్రతను మెరుగుపరచడంలో ఏఐ కీలక పాత్ర పోషిస్తుందని నివేదిక పేర్కొంది. అలాగే నైతిక ప్రమాణాలు, మానవ పర్యవేక్షణ, గ్రీన్ ఏఐ విధానాలను అనుసరించాలని సూచించింది.

దేబ్‌జానీ ఘోష్ మాట్లాడుతూ, విశ్వసనీయ ఏఐ వ్యవస్థలు, డిజిటల్ నైపుణ్యాల అభివృద్ధి, బాధ్యతాయుత ఆవిష్కరణలు, సమగ్ర విధాన రూపకల్పన ద్వారా భారత్‌ను జ్ఞానాధారిత, డిజిటల్ శక్తివంతమైన దేశంగా తీర్చిదిద్దవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, పరిశోధకులు, విద్యావేత్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు హెటెరోతో ఒప్పందం.. ఫార్మా రంగంలో 300కుపైగా ఉద్యోగ అవకాశాలు

ఆదాబ్ సైబరాబాద్ , హైదరాబాద్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధితో పాటు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యాశాఖ ప్రముఖ ఔషధ సంస్థ హెటెరో ఫార్మాస్యూటికల్స్‌తో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది.

డైరెక్టర్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అభిలాష అభినవ్ ఐఏఎస్ సమక్షంలో ఈ ఒప్పంద పత్రాల మార్పిడి జరిగింది. కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ యెంక్యా నాయక్, స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వొకేషనల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ డా. జ్యోత్స్న రాణి, హెటెరో హెచ్‌ఆర్ వైస్ ప్రెసిడెంట్ డా. ఎస్. వెంకట జయపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈ ఒప్పందం ద్వారా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న ఇంటర్మీడియట్, వొకేషనల్ విద్యార్థులకు పరిశ్రమలతో అనుసంధానం, క్యాంపస్ నియామకాలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణ, ఇంటర్న్‌షిప్‌లు, అధ్యాపకులకు ఇండస్ట్రీ ఎక్స్‌పోజర్, సీఎస్ఆర్ కింద ప్రయోగశాలల అభివృద్ధి, ముఖ్యంగా లైఫ్ సైన్సెస్ మరియు అనుబంధ విభాగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారు.

ఈ సందర్భంగా డైరెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, విద్యార్థులకు పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన శిక్షణతో పాటు స్థిరమైన ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ఈ భాగస్వామ్యం లక్ష్యమని తెలిపారు.

హెటెరో హెచ్‌ఆర్ వైస్ ప్రెసిడెంట్ డా. ఎస్. వెంకట జయపాల్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ యువత ఉపాధి అవకాశాలను పెంపొందించే ప్రభుత్వ లక్ష్యానికి తమ సంస్థ భాగస్వామ్యం కావడం సంతోషకరమని, ఇంటర్మీడియట్ అర్హత కలిగిన యువతకు 300కుపైగా ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు వెల్లడించారు.

ఈ భాగస్వామ్యం ద్వారా వృత్తి విద్యను మరింత బలోపేతం చేసి, తెలంగాణ యువత ఉపాధి అవకాశాలను విస్తరించడంలో కీలక అడుగుగా విద్యాశాఖ పేర్కొంది.



## ఢిల్లీలో ధూంధాంగా ముగిసిన లాల్‌దర్వాజా మహంకాళి బోనాల మహోత్సవాలు



ఆదాబ్ సైబరాబాద్, న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో తెలంగాణ ప్రభుత్వ సహకారంతో మూడు రోజుల పాటు నిర్వహించిన లాల్‌దర్వాజా సింహవాహిని శ్రీ మహంకాళి అమ్మవారి బోనాల మహోత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా ముగిశాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిర్వహించిన ఈ వేడుకలు వేలాది మంది భక్తులను ఆకట్టుకున్నాయి.ముగింపు రోజు అమ్మవారికి బంగారు బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు బోనాలు సమర్పించగా, పోతురాజు విన్యాసాలు, సంప్రదాయ ఆచారాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏ.పీ. జితేందర్ రెడ్డి, ఎంపీలు వేమ్ నరేందర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, రామసహాయం రఘురాం రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గత 12 ఏళ్లుగా దేశ రాజధానిలో తెలంగాణ సంస్కృతిని వైభవంగా కొనసాగిస్తున్న ఉత్సవ కమిటీని వారు అభినందించారు.సాయంత్రం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో సుమారు 150 మంది కళాకారులు డప్పు వాద్యాలు, పోతురాజు విన్యాసాలు, ఒగ్గుడోలు, జానపద నృత్యాలతో తెలంగాణ కళా వైభవాన్ని ఆవిష్కరించారు. సంప్రదాయ వస్త్రధారణలో మహిళలు బోనాలతో పాల్గొనడంతో తెలంగాణ భవన్ ఆధ్యాత్మిక, సాంస్కృతిక శోభతో కళకళలాడింది.ఉత్సవ కమిటీ చైర్మన్ బి. మారుతి యాదవ్ మాట్లాడుతూ, ఉత్సవాల విజయవంతానికి సహకరించిన తెలంగాణ ప్రభుత్వం, అధికారులు, ప్రజాప్రతినిధులు, కళాకారులు, మీడియా ప్రతినిధులు, భక్తులకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో బోనాల మహోత్సవాలను మరింత వైభవంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు.

## మహారాష్ట్ర క్రీడా, యువజనాభివృద్ధిపై కేంద్రం ప్రత్యేక కార్యాచరణ..

### కేంద్ర మంత్రి రక్షా ఖడ్సే సమీక్ష










న్యూఢిల్లీ: మహారాష్ట్రలో క్రీడలు, యువజనాభివృద్ధిని మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ సహాయ మంత్రి రక్షా ఖడ్సే అధ్యక్షతన కేంద్ర, మహారాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో క్రీడా పాలనలో సంస్కరణలు, ప్రతిభావంతులైన క్రీడాకారుల తయారీ, కోచ్‌లకు నిరంతర శిక్షణ, క్రీడా విజ్ఞానం, ఖేలో ఇండియా కేంద్రాల బలోపేతం, మిషన్ లక్ష్యవేధ్, ఆధునిక క్రీడా మౌలిక వసతులు, డిజిటల్ అథ్లెట్ మేనేజ్‌మెంట్ వ్యవస్థ, ప్రైవేటు రంగ భాగస్వామ్యం, అంతర్జాతీయ సహకారం, ప్రాజెక్ట్ మహాదేవా అమలు వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. యువజన వ్యవహారాల సంస్థాగత బలోపేతం, యువత నాయకత్వ వికాసం, వివిధ శాఖల సమన్వయంపై కూడా సమావేశంలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా మంత్రి రక్షా ఖడ్సే మాట్లాడుతూ, ఖేలో భారత్ విధానం లక్ష్యాల సాధనతో పాటు ప్రధాని నరేంద్ర మోదీ ప్రతిపాదించిన వికసిత్ భారత్ విజన్‌కు కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయం కీలకమని పేర్కొన్నారు. మహారాష్ట్రను దేశంలో అగ్రగామి క్రీడా రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు చేపట్టనున్న సంస్కరణలు దోహదపడతాయని తెలిపారు. సమావేశంలో కేంద్ర క్రీడల శాఖ కార్యదర్శి హరి రంజన్ రావు, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు, మహారాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

TGTEL/26/A4985
ఆదాబ్ సైబరాబాద్
ADAAB CYBERABAD



## ఖమ్మం త్రివేణి లో చంద్రశేఖర్ ఆజాద్, బాలగంగాధర్ తిలక్ జయంతి సందర్భంగా ఘన నివాళి



ఆదాబ్ సైబరాబాద్, ఖమ్మం: జూలై 23న స్వాతంత్ర్య సమరయోధులు చంద్రశేఖర్ ఆజాద్ మరియు బాలగంగాధర్ తిలక్ జయంతి సందర్భంగా ఖమ్మం నగరంలోని త్రివేణి పాఠశాలలో ఘనంగా నివాళి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో మహనీయులు తమ ప్రాణాలను అర్పించారు. చంద్రశేఖర్ ఆజాద్ ధైర్యసాహసాలు, బాలగంగాధర్ తిలక్ దేశభక్తి భావాలు ప్రతి భారతీయుడికి స్ఫూర్తిదాయకం. విద్యార్థులు వారి ఆదర్శాలను జీవితంలో ఆచరిస్తూ, క్రమశిక్షణ, దేశభక్తి, సేవాభావంతో ముందుకు సాగాలి" అని అన్నారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపల్ పి.రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ, స్వేచ్ఛను సాధించడానికి మహనీయులు చేసిన త్యాగాలను ఎప్పటికీ మరువరాదు. వారి జీవిత చరిత్రలను చదివి, వారు చూపిన మార్గంలో నడవడం ద్వారా విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలి. దేశాభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలి అని విద్యార్థులకు సూచించారు.

ఈ సందర్భంగా పాఠశాల వైస్ ప్రిన్సిపాల్స్ స్వప్న, ముస్తఫా, సిఆర్ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, క్యాంపస్ ఇంచార్జ్ విక్టర్ చార్లెస్, ట్రాన్స్పోర్ట్ ఇంచార్జ్ సందీప్ ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు మరియు విద్యార్థినీ విద్యార్థులతో కలిసి మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

## దానవాయిగూడెం లో మృతుడు గోగుల వెంకులు

### కుటుంబానికి అండగా నిలిచిన, చల్లా కృష్ణ



ఆదాబ్ సైబరాబాద్,ఖమ్మం/దానవాయిగూడెం :

పాలేరు నియోజకవర్గ పరిధిలోని 59 డివిజన్ దానవాయిగూడెం కాలనీ కి చెందిన, గోగుల వెంకులు ఇటీవల కాలంలో అకస్మాత్తుగా మరణించారు. విషయం తెలుసుకున్న రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అనుచరుడు తుంబురు దయాకర్ రెడ్డి సలహామేరకు కాంగ్రెస్ పార్టీ ఖమ్మం టౌన్ జనరల్ సెక్రటరీ చల్లా కృష్ణ మృతుల కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థిక సహాయం అందించి వారి కుటుంబానికి మనోధైర్యం ని నింపారు. రోజు దశదిన కార్యక్రమానికి తమ వంతు సహాయంగా చల్లా కృష్ణ 5,000/ రూపాయలు కుటుంబసభ్యులకు అందజేశారు. వారి కుటుంబానికిఎల్లపుడూ, కాంగ్రెస్ పార్టీ తరుపున అందుబాటులో ఉంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో చల్లా కృష్ణ టీమ్ సభ్యులు మరియు మృతుడి బంధువులు పాల్గొన్నారు.

## అదుపుతప్పి మూడు వాహనాలను ఢీకొన్న వాటర్ ట్యాంకర్.. ఒకరి మృతి



**రంగారెడ్డి, జులై 22:** జిల్లాలోని నార్సింగి-పుప్పాలగూడ టోల్‌గేట్ వద్ద వాటర్ ట్యాంకర్ బీభత్సం సృష్టించింది. అతివేగంగా దూసుకొచ్చిన ట్యాంకర్.. బైక్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో బైక్‌పై వెళుతున్న సుశీల్ కుమార్(28) అనే వ్యక్తి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తి సురేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం తర్వాత అదుపు తప్పిన ట్యాంకర్ మరో కారు, స్కూటీని కూడా ఢీ కొట్టింది. దీంతో మొత్తం మూడు వాహనాలను వాటర్ ట్యాంకర్ ఢీకొట్టింది. సమాచారం అందిన వెంటనే నార్సింగి పోలీసులు అక్కడకు చేరుకుని పరిస్థితిని పరిశీలించారు.ట్యాంకర్ డ్రైవర్ రంజిత్ సింహాను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. అలాగే గాయపడిన సురేష్‌ను చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. సుశీల్ మృతి సమాచారాన్ని కుటుంబసభ్యులకు తెలియజేశారు. ప్రమాదంపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## నీట్ పేపర్ లీక్‌పై కాంగ్రెస్ భగ్గుమంది



ఆదాబ్ సైబరాబాద్, జవహర్ నగర్ : నీట్ పేపర్ లీక్ ఘటనపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ మల్కాజిగిరిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఆందోళన చేపట్టారు. ఇదే సమయంలో లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అరెస్టును తీవ్రంగా ఖండిస్తూ నాయకులు, కార్యకర్తలు రోడ్డుపై బైఠాయించి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన నీట్ పరీక్షలో పేపర్ లీక్ జరగడం కేంద్ర ప్రభుత్వ ఘోర వైఫల్యమని విమర్శించారు. ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రతిపక్ష స్వరాన్ని అణచివేసే కుట్రలో భాగంగానే రాహుల్ గాంధీ అరెస్టు జరిగిందని ఆరోపిస్తూ ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు కాంగ్రెస్ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

ఈ నిరసనలో కార్యక్రమం లో కాంగ్రెస్ అధ్యక్షులు శాంతి కోటేష్ గౌడ్, మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, శంకర్ గౌడ్, మహిళా కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు..

## ప్రీ ప్రైమరీ ఇన్స్ట్రక్టర్ ఉద్యోగాల నియామకంలో అక్రమాలు.

అర్హత లేని వారికి ఉద్యోగలిచ్చారు

విచారణ జరిపి న్యాయం చేయాలి దగ్గుబాటి సామ్రాజ్యం.




ఆదాబ్ సైబరాబాద్, ఖమ్మం : చింతకాని మండలం వందనం గ్రామంలో జరిగిన ప్రీ ప్రైమరీ ఇన్స్ట్రక్టర్ ఉద్యోగాల నియామక ప్రక్రియలో తనకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆ గ్రామానికి చెందిన దగ్గుబాటి సామ్రాజ్యం ఆవేదన వ్యక్తం చేశారు. అర్హతలు ఉన్నప్పటికీ తనను పక్కనపెట్టి, అర్హత లేని, తక్కువ అర్హతలు కలిగిన ఇతర వ్యక్తులకు ఉద్యోగాలు కట్టబెట్టారని ఆమె ఆరోపించారు. ఖమ్మం లోని ప్రెస్ క్లబ్ లో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సామ్రాజ్యం మాట్లాడుతూ ఉద్యోగాల ఎంపిక విషయంలో గ్రామ అధికార పార్టీ నాయకులు, సంబంధిత ప్రభుత్వ అధికారులతో కుమ్మక్కై వ్యవహరించినట్లు అనుమానం వ్యక్తం చేశారు. ఇంటర్వ్యూ పేరుతో అభ్యర్థులను రోజుల తరబడి కాలయాపన చేయించి, చివరకు నిబంధనలకు అనుగుణంగా ఇంటర్వ్యూ కూడా నిర్వహించలేదని ఆరోపించారు. కేవలం ఒక నిమిషం పాటు ఇంటర్వ్యూ నిర్వహించి, అభ్యర్థుల అర్హతలు, విద్యార్హతలు, అనుభవాన్ని సరిగా,పరిశీలించకుండా ఉద్యోగాలకు ఎలా ఎంపిక చేశారని ఆమె ప్రశ్నించారు. ఇంటర్మీడియట్ కనీస అర్హతగా ఉన్నప్పటికీ, దానికంటే ఎక్కువ విద్యార్హతలు కలిగిన అభ్యర్థులను పక్కనపెట్టి, స్థానిక నాయకులకు నచ్చిన వారికి ఇష్టారాజ్యంగా ఉద్యోగాలు కట్టబెట్టారని ఆరోపించారు.

ఈ నియామకాల విషయంలో డబ్బులు చేతులు మారినట్లు తమకు అనుమానంగా ఉందన్నారు. ఉద్యోగాల నియామకానికి సంబంధించిన దరఖాస్తులు, అభ్యర్థుల అర్హతలు, ఇంటర్వ్యూ ప్రక్రియ, ఎంపిక జాబితా, అధికారుల పాత్రపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరపాలని ఆయన కోరారు. అక్రమాలు జరిగినట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకొని, అర్హత కలిగిన అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ వ్యవహారంపై సంబంధిత ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి తగిన విచారణ జరపాలి. నాకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్ది న్యాయం చేయాలి. ఉద్యోగాల ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా మళ్లీ పరిశీలించాలి అంటూ డిమాండ్ చేశారు.

## తెలంగాణలో అదనపు ధాన్యం కొనుగోలుకు కేంద్రం ఆమోదం




హైదరాబాద్, జులై 22 :

తెలంగాణ ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. రాష్ట్రంలో రబీ సీజన్‌కు సంబంధించి అదనంగా వడ్ల కొనుగోలు చేసేందుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇప్పటికే ఉన్న కొనుగోలు లక్ష్యానికి అదనంగా 8 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని కొనుగోలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీంతో రైతులకు పెద్ద ఊరట లభించనుంది.కేంద్ర ప్రభుత్వం సవరించిన వరి కొనుగోలు అంచనాను బియ్యం రూపంలో 43 లక్షల మెట్రిక్ టన్నులు గా నిర్ణయించింది. ఈ నిర్ణయం ద్వారా తెలంగాణలో రైతులు పండించిన ధాన్యానికి మరింత మార్కెట్ భరోసా లభించనుంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ నిర్ణయాన్ని స్వాగతించింది. ఇదే సమయంలో రాష్ట్రవ్యాప్తంగా వాహనాల స్థాన నిర్ధారణ వ్యవస్థ (అమలుపై కూడా కేంద్రం కీలక ఆదేశాలు జారీ చేసింది. 2026 సెప్టెంబర్ 30 నాటికి రాష్ట్రంలోని అన్ని అర్హత గల వాహనాల్లో వీఎల్టీఎస్ వ్యవస్థను పూర్తిగా అమలు చేయాలని కేంద్రం స్పష్టం చేసింది. ఈ వ్యవస్థ ద్వారా వాహనాల కదలికలను రియల్ టైమ్‌లో పర్యవేక్షించే అవకాశం ఉండటంతో భద్రతా ప్రమాణాలు మరింత మెరుగుపడనున్నాయి.

## ప్రశ్నపత్రాల లీకేజీలపై కేంద్రం మరిన్ని కఠిన చర్యలు..

## నేడు కేబినెట్‌లో కీలక నిర్ణయాలు: ప్రధాని మోదీ




న్యూఢిల్లీ: ప్రశ్నపత్రాల లీకేజీలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం మరిన్ని కఠిన చర్యలు తీసుకోనున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. ఈ మేరకు గురువారం రాత్రి విడుదల చేసిన వీడియో సందేశంలో, "ప్రశ్నపత్రాల లీకేజీలపై మరింత కఠిన చర్యలకు సంబంధించి నేటి కేంద్ర మంత్రివర్గ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకోనున్నాం" అని తెలిపారు. ఈ విషయాన్ని ప్రధాని మోదీ తన అధికారిక ఎక్స్ (శ) ఖాతా ద్వారా కూడా వెల్లడించారు. దేశవ్యాప్తంగా పోటీ పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీలపై ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో, పారదర్శకమైన పరీక్షల నిర్వహణతో పాటు నిందితులపై మరింత కఠిన చర్యలు తీసుకునే దిశగా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టనున్నట్లు సమాచారం.

## టీచర్లకు టెట్ రద్దు చేయాలి - జీవశాస్త్ర ఉపాధ్యాయుల డిమాండ్



వికారాబాద్ జిల్లా: వికారాబాద్ పట్టణంలోని అనంతగిరిపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి జీవశాస్త్ర ఇన్-సర్వీస్ ఉపాధ్యాయుల శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు పలు విద్యా, పర్యావరణ అంశాలపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులకు టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (ుజు)ను పూర్తిగా రద్దు చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఒకవేళ రద్దు చేయడం సాధ్యం కాకపోతే, జీవశాస్త్ర ఉపాధ్యాయులకు జీవశాస్త్ర పెడగాజీ నుంచే ప్రశ్నలు ఇవ్వాలని, అలాగే అన్ని వర్గాల అభ్యర్థులకు ఒకే విధంగా 50 శాతం అర్హత మార్కులను నిర్ణయించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే డీఎస్సీ పరీక్షలో ఉత్తీర్ణులై ప్రభుత్వ ఉపాధ్యాయులుగా నియమితులైన వారిని తిరిగి టెట్ రాయాలని కోరడం సమంజసం కాదని వారు అభిప్రాయపడ్డారు. ఓసీ, బీసీ, ఎస్సీ తదితర వర్గాలకు వేర్వేరు అర్హత మార్కులు నిర్ణయించడం శాస్త్రీయ విధానం కాదని పేర్కొన్నారు.

అదే సమయంలో పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతగా శిక్షణా కార్యక్రమంలో మధ్యాహ్న భోజనం సందర్భంగా ప్లాస్టిక్ ప్లేట్లకు బదులుగా స్టీల్ ప్లేట్లను ఉపయోగిస్తూ ఉపాధ్యాయులు ఆదర్శంగా నిలిచారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణ కాలుష్యంతో పాటు ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు కూడా ఇది కారణమవుతుందని వారు తెలిపారు. ఇంట్లో, పాఠశాలల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో సాధ్యమైనంత వరకు ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా మానేసి, స్టీల్ వంటి పునర్వినియోగ వస్తువులను ఉపయోగించాలని ఉపాధ్యాయులు ప్రజలకు పిలుపునిచ్చారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని వారు కోరారు.


EDITOR PRINTER AND PUBLISHER OWNED BY BILLALPURSARA SHIVA KUMAR, PRINTING AT RIYAZ PRINTING PRESS, S NO 22-8-161, BEHIND NAYAAB HOTEL, CHATTA BAZAR, HYDERABAD, TELANGANA - 500002 AND PUBLISHED FROM H.NO: 2-1-602, TARAKARAMA NAGAR, YELLAMMABANDA, KUKATPALLY, MEDCHEL- MALKAJGIRI DIST, TELANGANA-500 072. PRGI: TGTEL/26/A4985. PHONE NO: +91 8686861338, +91 81215 50907 EMAIL : shivakumarlal@gmail.com